గారడీవాడు తమాషాలు చేసి వెళ్ళిపోతూంటే. అప్పుడే అయిపోయిందా అనిపించేస్తుంది.

సర్కస్‌డేరాలు ఎత్తేశాక ఆ మైదానం పెళ్ళి పందిళ్లు తీశాక వెలవెలబోతున్న పెళ్ళయిన ఇల్లులా వెలితిగా వుంటుంది.

కొన్నాళ్ళయాక ఆ వెలితికి అలవాటు పడిపోతారు. అప్పుడు కన్నెపిల్లమనసులో రంగుల డేరా వెలిసినట్లు ఆ సంగతి మనసుని హత్తుకుని పోయి మళ్లీ సర్కస్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తే రాగానే సంబరపడి పోతాము.

హరికథలకి, పాట కచేరీలకి వెళ్ళే వాళ్ళ కంటె సర్కస్‌కి వెళ్ళే వాళ్ళంటేనే నాకు ఎక్కువ ఇష్టం.

అబ్బ; రంగులడేరాని నా జన్మలో మర్చిపోలేను.

ఏమండోయ్ శ్రీవారూ ఒక చిన్నమాట;

మన సంసారం ఒక చిన్న రంగుల డేరా అయితే అందులో రింగ్ మేస్టరు మీరు కత్తులు నా మీద విసురుతారు.

మన పిల్లలు జంతువులు. మన పాలవాడు, పనిమనిషి కోతులు, చింపాజీనూ – మన ఇంటి వాళ్ళు ఏనుగులు, మీ ఆఫీసువాళ్ళు పెద్ద పులులూ, సింహాలూనూ, మాచెల్లెళ్ళు సర్కస్ కన్యలైతే మీ తమ్ముళ్ళు బఫూనులు –

"అయితే హిపో పోటోమస్ ఎవరూ –"

అమ్మబాబోయ్ ఛంపేస్తారు నేను చెప్పను గాకచెప్పను;

# ఐ లైకిట్

మాంఛి ఎండలో ఐస్ వేసిన మామిడికాయ ముక్కలు తిని సర్బత్ తాగాలనుంటుంది. (ఎవరింటికేనా వెళ్తే కుంపటి వెలిగించి కాఫీ పెట్టి ఇస్తారు తెలుగువాళ్ళు) వర్షంలో ఏం చేయాలనుంటుంది?

వర్షం కురుస్తూంటే మొక్కజొన్న పొత్తులు కాల్చేచోట రిక్షాను ఆపుచేసి వేడి వేడి పొత్తులు రెండు మూడు కాల్పించుకుని అవి తింటూ కబుర్లు చెప్పుకుంటూ సినిమాహాలు దాకా వెళ్తే ఆ తరువాత సహజంగా సినిమా అట్టే బాగులేక పోయినా ఫరవాలేదు.

ఇంటర్వెల్లో మళ్ళీ సోడావేసి నిమ్మకాయ రసం పిండిన మిరప కాయ బజ్జీలు కొరుక్కు తింటుంటే నెత్తిమీద చినుకులు పడుతున్నా తెలీదు. ఆఘాటు అటువంటిది.

ఏపని చేయడానికైనా సమయాలున్నాయి ఆ సమయాలు పాటిస్తే జీవితం ఎంతో అద్భుతంగా వున్నట్లనిపిస్తుంది.

మా వూళ్లో పెద్ద అరుగు మీద కూర్చుని చుట్టూ పిల్లలు అల్లరి చేస్తుంటే ఆ కబుర్లూ చెప్పుకుంటూ గెల తరువాత గెల పాలేరు కొట్టిస్తూంటే తాటి ముంజలు తిన్న రుచి ఆ పుట్టింటి రుచి మరుపురాదు.

ఇప్పుడు సాగదనుకోండి - ఎప్పుడేనా కాలవ గట్టున చీకట్లో చేయి చేయి కలిపి షికారుకెళ్తే కొంచెం హుషారుగా వుంటుంది. షికారు కని వెళ్ళం అనుకోండి - ఏ బజారుకో ఎవరింటికొ వెళ్ళి తిరిగివచ్చినట్లనుకోండి.

చాకింటి మడతలు చక్కగా చాపమీద పేరుస్తుంటే చూడ ముచ్చటగా ఉంటుంది. (మడత విప్పిచూస్తే చింపుకొచ్చి నందుకు గందరగోళంగా వుండొచ్చు) మంచం నల్లుల కుక్కి అయినా పక్కమీద తెల్లటి దుప్పటి నిండుగా పరిస్తే అందుమీద నడుం వాల్చుకోగానే హాయనిపిస్తుంది.

చెంబులూ గిన్నెలూ అన్నీ చక్కగా తోముకుని అలమార్లో తళతళ లాడేలా అమరిస్తే వాటిని చూసి ఇల్లాలి మనసుకూడా స్టీలు గిన్నెలాతళతళ లాడుతూ వుంటుంది.

పెట్టెముందు కూర్చుని పట్టుచీర మడతల్లో దాచుకున్న రూపాయి నోట్లతో బాటు పాత ఉత్తరాలు చుట్టిన సెంటు రాసినసిల్కు జేబురుమాల దోసిట్లోకి తీసుకుంటే జీవితమంతా ఘుమ ఘుమలాడిపోయినట్లుంటుంది.

కాపురానికొచ్చినపుడు పుట్టింటినించి తెచ్చుకున్న పెట్టె - దాని మూత తెరిస్తే నిండా అపురూపమైనవస్తువులే - అతి మనోహరమైన జ్ఞాపకాలే.

బొట్టుపెట్టె - పూజలూ - దారాలూ అల్లికరుమాళ్ళు - మీరు అప్పుడప్పుడు పంపినవీ - నేను మీకు గుర్తుగా బహూకరించినవి - వెండి సబ్బు బిళ్ళ పెట్టె - పన్నీరు బుడ్డి - దీనితో పన్నీరు ఎప్పుడైనా జల్లుకున్నామా... (బహుశా మనం జల్లుకోడానికి కాదేమో) గంధపు గిన్నె... మీరూ నేనూ పూసుకోడానికి - మీకంత ఓపికెక్కడిది? కూర్చుని గంధం పూయించుకుంటారా... వోచెంప నిద్రకూరుకొస్తూంటే - మీ ఫ్రెండ్స్ ఎవరైనా వచ్చినపుడు ఈ పన్నీరు బుడ్డి, గంధపుగిన్నె బల్లమీద నింపి పెడతాను. మీరు ఒకసారి పన్నీరుజల్లి గంధం పూశారా మెడలకూ - మళ్ళీ మీజోలికి రారు. మీకు మతిపోయిందనుకుంటారు తమలపాకుల పళ్లెం - ఇందులో ఆకులు వక్కపొడి భరిణెలోవక్కపొడి పెట్టుకుని సున్నం చేత్తో పట్టుకుని మీరున్నచోటికి నేను రావాలన్నమాట. ఐ డోంట్ లైక్ ఆల్ దిస్ - నేన్రానురాను, రానంటే రాను.

అబ్బ. ఈ పెట్టెముందు కూర్చుంటే కాపురాని కొచ్చినప్పట్నుంచీ నాటినుంచి నేటివరకు ఎన్నెన్ని మధుర స్మృతులో - పది పదిహేనేళ్ళ నుంచీ మీరు తెచ్చిన జీతాలన్నీ ఇందులోనే ఈ బట్టల మడతల్లోనే దాచి పెట్టి సంసారం చేశాను. ఆ రూపాయలన్నీ ఎక్కడకు వెళ్ళి పోయాయంటారు? మనకొచ్చిన ఏళ్ళన్నీ ఎక్కడ్నుంచి వచ్చి ఎక్కడకు వెళ్తున్నాయో. ఆ రూపాయలన్నీ అక్కడికే వెళ్ళుంటాయి. ఆ రూపాయలన్నీ ఈ పెట్లోంచే మాయమైనాయి. కావాలంటే పెట్టె బోర్లించి చూస్కోండి - మీ డబ్బు నే నెక్కడా దాచలా - ఓ సారి ఓ రెండు పదిరూపాయల నోట్లు హఠాత్తుగా నానిగాడి పట్టులాగు మడతల్లోకీ ఎలా వెళ్ళి దాక్కున్నాయో, ఏదో పండుగరోజు పట్టులాగు తీసేసరికి రెండు పదిరూపాయల నోట్లు కనిపించాయి. అది

మన డబ్బే కాని ఎంత ఆనందం ఎంత అద్భుతం కలిగించాయి ఆ దొంగనోట్లు – (నోట్లు దొంగవి కావు. దొంగల్లా దాక్కున్నాయి కనుక దొంగనోట్లన్నాను.)

మైడియర్ సార్! ఏవీ మీకు జ్ఞాపకంవుండవు. మీ జేబుల్లో, అన్ని జేబుల్లోనూ తలోకాస్తా చిల్లర–డబ్బులూ–నోట్లూ వెతుక్కున్నప్పుడల్లా దొరుకుతాయి. నేను ఉత్తరాలకోసం సెర్చి చేసినపుడు నాకు కొన్ని దొరుకుతాయిలేండి. అవన్నీ తెచ్చి పూసల మణిపర్సులో పెట్టి – పూసల మణిపర్సు మరో ట్రాఫీల డబ్బాలో పెట్టి ట్రాఫీల డబ్బా పెట్లో మూల దాస్తాను. ఆ చిల్లర చివరికి చిన్న నోట్లు మనకు నెలాకర్లో సినిమా కెళ్ళడాన్కి మీకుచిల్లర ఖర్చులకు ఇంపీరియల్ బ్యాంక్‌లా పని చేసేది. ఏవండీ బేంకులో డబ్బు యింతకంటే ఎక్కువవుంటుందా అంటే మీరు పగలబడి నవ్వారు అప్పుడొకసారి.

నా పెట్టెమూత తెరిస్తే అక్కడనుంచి కదల బుద్ధెయ్యదు. పిల్లలుచుట్టూ మూగి అదేమిటి ఇదేమి టంటారు. మీరంతా ఇందులోంచే పైకొచ్చారు – దేవుడేతెచ్చి మిమ్మల్ని ఇందులో దాచాడు. ఒక్కొక్కరు బైట కొచ్చారు. అంటే ఆశ్చర్యంతో వాళ్ళు చూస్తూంటే నాకు నవ్వొచ్చేసేది

మీరోసారి ఫోటోకి రమ్మన్నారు.

ఫోటో తీయించుకోడాని కెళ్ళడమంటే నాకు మాచెడ్డచిరాకు.

నా కక్కడేమీ సంతోషంగా ఉండదు.

"ఒకమాటు నవ్వండి. ఇటు చూడండి" అని ఆర్డరు వేస్తాడు, వాడు నవ్వమన్నప్పుడు నవ్వి వాడు ఏడవమన్నప్పుడు ఏడవడాని కొచ్చామను కుంటున్నాడేమో–– ఆఫొటిగరాప్పంతులు. తీరా ఆఫోటోలో బొమ్మలు మనలను వెక్కిరిస్తూన్నట్లున్నాయి. మనలోలేని గుణాలన్నీ బయటకుతీస్తాడు ఫోటోలవాడు, నాకు ఫోటో స్టూడియోకంటే బట్టల షాపు కెళ్ళడమంటే చాలా సంతోషంగా వుంటుంది. – వాడే చిరునవ్వులు చిందిస్తు మనకెదురవుతాడు. రకరకాల బట్టలు వాడు విసుక్కోకుండా చూపిస్తాడు. అవన్నీ మనం కొంటామనుకుంటాడు. అన్నీ మనం కొనుక్కోలేం. మనం కొన్నే కొనుక్కున్నా ఆ కొన్నిటికే బిల్లురాసి డబ్బులు పుచ్చుగుని "థాంక్యూ" అంటాడు ఇంకానేను వెనక్కి జాకెట్టు గుడ్డలకేసిచూస్తోంటే – పద పద అని విసుక్కుంటూ గొడ్డును తోలినట్లు తోల్తారు. ఐడోంట్ లైక్ ఆల్ దిస్... మీరు బిల్లు పేచేస్తున్నప్పుడు కూడా ఆదర్శ హస్బెండువలె చిరునవ్వులు చిందిస్తూ వుండాలి.

ఎక్కడున్నా సుఖంగా, సరదాగా, ఈజీగా, హాయిగా జీవితం లాగించెయ్యాలి; ఎప్పుడూ ఏడుస్తూ ఈసురోమని వుండేకంటె మిరప కాయ బజ్జీలు తింటూ కాల్చిన మొక్కజొన్న పొత్తులుగానీ వేయించిన వేరుశనగ పలుకులు కానీ తింటూ, బెల్లంముక్క కొరుక్కుంటూ వర్షంలో అడపా తడపా తడుస్తూ యిటూ అటూ తిరుగుతూ సంతోషంగా జీవించే మనుష్యులంటే నాకెంతో ఇష్టం; బురదలో కూరుకుపోయిన బండి చక్రాల కంటే వానలో తార్రోడ్డుమీద పరిగెత్తే రిక్షాచక్రాలే బావుంటాయి.

వాన కురిస్తే, మెరుపు మెరిస్తే, ఆకసమున హరివిల్లు విరిస్తే... ఐలైకిట్! ఐలైకిట్!! ఐలైకిట్!!!